ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహా, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | బుధవారం | 01.07.2026 | సంపుటి : 1 | సంచిక : 351 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్




## కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

**బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ**

**కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు.**

**హైదరాబాద్, జూన్ 30 :** మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్టాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి దిల్లీకి డబ్బులు వెళ్తున్నాయి. దిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# చెప్పిందే చేస్తా.. అబద్ధాలు చెప్పను

**పదవి ఎవ్వరికీ శాశ్వతం కాదు**

**ఎన్టీఆర్, ఇందిర లాంటి వారే ఓడారు**


**ఇచ్చిన హామీ మేరకు మంచి పనులు చేయడమే నా లక్ష్యం**

**రైతులను రుణమాఫీ, రైతు భరోసాతో ఆదుకుంటున్నాం**

**బకాసురుడు కెసిఆర్ చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం**

**రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే ఛాన్స్ లేదు**

**రైతు భరోసా ఖరీఫ్ నిధుల విడుదల సభలో సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**



**పదవి ఎవరికీ శాశ్వతం కాదని, కేవలం ఇచ్చిన మాటే శాశ్వతంగా ఉంటుందని.. నాడు ఇందిరమ్మ, ఎన్టీఆర్ లాంటి మహానాయకులే ఓడిపోయారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. నేను అబద్ధాలు చెప్పను, చెప్పింది చేసి తీరుతా. ప్రజలకు నచ్చకపోయినా ఉన్నది ఉన్నట్లే చెప్తాను అని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ప్రజలది, రైతులది, ఆడబిడ్డలది అని భరోసా ఇచ్చారు. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు తాను ఎప్పటికీ చేయనని చెప్తూ.. ఆ పశుపతిని (కేసీఆర్‌ను) నీ ఫార్మ్‌హౌస్‌లోనే బంధించాను, ఇక బయటకు రానిచ్చే ప్రసక్తే లేదు' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. శిల్పకళావేదిక వేదికగా జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.**

**హైదరాబాద్,జూన్ 30 :** కేసీఆర్ మళ్లీ వస్తాడని ఇద్దరు పిల్ల రాక్షసులు చెబుతున్నారని.. ఆయన రావడం వల్ల ఆ కుటుంబానికే ఉపయోగం తప్ప ప్రజలకు ఒనగూరేదేముందని సీఎం ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు చెబుతున్నారని.. అయితే బెంగాల్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీకి 15 ఏళ్లు పట్టిందని.. ఇక్కడ కూడా అలాగే వేచి ఉండాలని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని చెప్పారు. రైతుల కోసం ప్రతినెలా రూ. 6 వేల కోట్ల చొప్పున గత 30 నెలల్లో రూ. 1.75 లక్షల కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పంటా కాళేశ్వరం నీళ్లతోనే పండుతోందని బీఆర్ఎస్ నేతలు చెప్పుకొనే వాళ్లని.. కానీ మూడేళ్లుగా అక్కడి నుంచి చుక్క నీరు -మిగతా 2 లో..



## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

**మనం అభివృద్ధి చెందడమే కాదు..**

**వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి**

**గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు.**

విశాఖపట్నం, జూన్ 30 : ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు మిగతా 2 లో



## ట్రంప్‌కు సుప్రీంలో చుక్కెదురు

**బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను సమర్థించిన అమెరికా సుప్రీంకోర్టు**

న్యూయార్క్, జూన్ 30 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను అమెరికా సుప్రీంకోర్టు సమర్థించింది. అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక ప్రాతిపదికన నివసిస్తున్న తల్లిదండ్రులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరిస్తూ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అమెరికా గడ్డపై జన్మించిన దాదాపు ప్రతి ఒక్కరికీ అమెరికన్ పౌరసత్వ హక్కును కొనసాగించేలా 6-3 మెజారిటీతో తీర్పు వెలువరించింది. అంతకుముందు, పౌరసత్వంపై -మిగతా 2 లో..




## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

**హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం**

**గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం**

**వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...**

**కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్**

**అత్యాధునిక యుద్ధ విమానాల్లో 'మేడ్ ఇన్ తెలంగాణ'**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, జూన్ 30 : ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్ -2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ / డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, 'ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణెళి కొత్త చిరునామా' -మిగతా 2 లో..

## కాంగ్రెస్ పీఆర్ స్టంట్లు చూసి అసహ్యించుకుంటున్నారు

**30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత**

**సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు**

**: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట కాంగ్రెస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతభరోసాకు కూడా బహిరంగసభా? అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్ చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి.**

హైదరాబాద్, జూన్ 30 : ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రూ.2లక్షల రుణమాఫీని చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారు. దిల్లీ టూర్లు, పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న రూ.కోట్ల ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి దృష్టి మళ్లించేందుకు చేపట్టే చర్యలు ఏమాత్రం పనిచేయవు. కేసీఆర్ ఠంచనుగా 11 సార్లు రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే -మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## పాలమూరు పరువు తీసేలా రేవంత్ వ్యవహారం

**కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రైతులను మోసం**

**బోనస్ హామీలు బోగస్‌గా మారాయి**

**జడ్చర్ల సభలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**

మహబూబ్‌నగర్, జూన్ 30 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా రైతులను మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రవర్తన, ఆయన మాట్లాడే తీరు పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నిర్వహిస్తున్నది ఆశీర్వాద సభ కాదని, అది ముమ్మాటికీ రైతు వంచన సభేనని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జడ్చర్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ సమయాల్లో -మిగతా 2 లో..





## కార్వాన్‌లో ఎన్నికల అధికారి వాసం పర్యటన

**సర్ ప్రక్రియ పరిశీలించిన అధికారి**

హైదరాబాద్, జూన్ 30 : రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు కార్యదర్శి వాసం వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం, చార్మినార్ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఇఆర్ఒ సరితారెడ్డితో కలిసి పర్యవేక్షించారు. బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ పక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ పక్రియపై ఓటర్లకున్న అపోహలపై వారికి నివృత్తి చేశారు. ఎస్ఐఆర్ పక్రియ యొక్క ముఖ్య ఉద్దేశాలను -మిగతా 2 లో..



## అంటార్కిటాలో పేలిన అగ్నిపర్వతం

**బంగారం ధూళిని వెదజల్లిన లావా**

అంటార్కిటికా, జూన్ 30 : సాధారణంగా అగ్నిపర్వతాలు లావా, బూడిద, విషవాయువులను వెదజల్లడం సాధారణమే. కానీ అంటార్కిటికాలోని మౌంట్ ఎరెబస్ అగ్నిపర్వతం మాత్రం బంగారాన్ని కూడా గాల్లోకి వెదజల్లుతోంది. మన భూమండలానికి పూర్తిగా దక్షిణ ప్రాంతంలో ఉన్న ఈ అగ్నిపర్వతం ప్రతిరోజూ సుమారు -మిగతా 2 లో..

# చెప్పిందే చేస్తా.. అబద్ధాలు చెప్పను

(మొదటిపేజీ తరువాయి)

రాకపోయినా తెలంగాణ రైతులు 2 కోట్ల 80 లక్షల టన్నుల ధాన్యం ఎలా పండించారో చెప్పాలని సీఎం ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో వరి పండించి క్వింటా రూ. 4,200కు అమ్ముకున్నాయన వరి వేస్తే ఉరి అని రైతులను భయపెట్టారని విమర్శించారు.

### కేసీఆర్ మళ్లీ వస్తాడా... ఎందుకు?

ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో అయిన అప్పు రూ. 69 వేల కోట్లు అయితే, పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం రూ. 7 లక్షల కోట్లకుపైగా అప్పు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు కూడా విడతలవారీగా ఇచ్చారని.. బడి పిల్లల భోజన బిల్లులు, యూనిఫాం బిల్లులు, స్వయం సహాయక సంఘాల బకాయిలు, సర్పంచుల బిల్లులు... ఇలా ఏ ఒక్కటీ చెల్లించకుండా వెళ్లిపోయారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు అయిందో లేదో అప్పుడే దిగిపోవాలంటున్నారని.. అడగగానే దిగిపోవడానికి తాము గడీల ముందు బానిసలమా? అని సీఎం ప్రశ్నించారు. 'కేసీఆర్ మళ్లీ వస్తే ప్రజలకు ఏం చేస్తడు. ప్రజలకేం ఇచ్చిండని వస్తడు? మొగుడు పెళ్లాలు మాట్లాడుకునే మాటలు వినడానికా? రైతు బజార్లు తీసుకురావాల్సింది పోయి బెల్టు షాపులు తీసుకొచ్చారు. రాష్ట్రంలో తాగుడు సంస్కృతిని పెంచారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. దళితులకు 3 ఎకరాల చొప్పున భూపంపిణీ ఇవ్వలేదు. రూ. లక్ష చొప్పున రైతులకు రుణమాఫీ చేయలేదు. మేం సంసారాల్లో చిచ్చుపెట్టే తప్పుడు రాజకీయాలు చేయం. ఫోన్ ట్యాపింగ్ లాంటి పనులు మా ప్రభుత్వంలో ఉండవు'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'తెలంగాణలో కూడా మోదీ పాలన వస్తదని బీజేపీ నేతలు అంటున్నారు. అయినా మోదీ వచ్చి మోరీ తీస్తాడా? ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోదీ చెప్పారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ లెక్కన 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు రావాలి. ఎక్కడ ఉన్నాయి ఆ ఉద్యోగాలు? తెలంగాణలో బండి సంజయ్, కిషన్‌రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు'అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్. వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి




అధికారంలోకి వచ్చిన రోజే ఉచిత విద్యుత్‌పై సంతకం చేశారు. రూ. 12 వేల కోట్ల విద్యుత్ బిల్లులను కూడా మాఫీ చేశారు. ఎవరైనా ఉచిత విద్యుత్ ఇచ్చామంటే ఉరికించి కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు కూడా ఉచిత విద్యుత్ కోసం గత 30 నెలల్లో రూ. 30 వేల కోట్లు వెచ్చించాం. ప్రతిపక్ష నాయకులు మూసీ అభివృద్ధి వద్దంటారు... మెట్రో వద్దంటారు... రీజనల్ రింగ్ రోడ్ వద్దంటారు... పొర్లు దండాలు పెట్టినా అభివృద్ధి పనులు ఆపం'అని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.

### పంట మార్పిడి తప్పనిసరి

ఈసారి వర్షాలు తక్కువగా పడే అవకాశముందని శాస్త్రవేత్తలు చెబుతున్నందున వర్షాలను బట్టి రైతులు పంటలు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 'మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాం. రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు వేయాలి. పంట మార్పిడి చేయాలని శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు నేను చెబితే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అబద్ధాలు చెప్పుకుంటూ బతకాలనే శాపం బావబామ్మర్దులకు ఉన్నట్లుంది. అందుకే పోటీ పడి అబద్ధాలు చెబుతున్నారు. ఎవరేం చెప్పినా 9 రోజుల్లో రైతుభరోసా కింద రూ. 9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

### భూమి భరోసా కాదు.. పంటకు భరోసా: మంత్రి తుమ్మల

భవిష్యత్తులో పంట వేసిన వారికే రైతు భరోసా అందించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ఇది భూమి భరోసా కాదని, పంటకు ఇచ్చే భరోసా అని స్పష్టం చేశారు. పంటల మార్పిడి చేయాలని, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు పప్పు దినుసులు పండించాలని కోరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా, రైతు రుణమాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపులతో రైతుల జీవితాల్లో నమ్మకాన్ని నింపామన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితోపాటు రైతు వేదికల నుంచి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

## ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. 'ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయి' అని చెప్పారు. అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్?16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్‌ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది' అని పేర్కొన్నారు. స్పెయిన్, కెనడాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్‌ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్-అండ్-ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు.



## అంటార్కిటాలో పేలిన అగ్నిపర్వతం

(మొదటిపేజీ తరువాయి)

80 గ్రాముల బంగారు ధూళిని వాతావరణంలోకి విడుదల చేస్తోందని శాస్త్రవేత్తలు ఎప్పుడో గుర్తించారు. దీని విలువ రోజుకు సుమారు 6,000 డాలర్లు (దాదాపు 5.67 లక్షలు). అంటే ఏడాదికి దాదాపు 22 లక్షల డాలర్లు (రూ.18.9 కోట్లకు పైగా) ఉంటుందని అంచనా. మౌంట్ ఎరెబస్ నుంచి వెలువడే బంగారం ఆవిరి రూపంలో ఉంటుంది. అగ్నిపర్వతం నుంచి సుమారు 1,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో బయటకు వచ్చే ఈ వేడి ఆవిరి అంటార్కిటికాలోని తీవ్రమైన చలిని తాకగానే చల్లబడి సూక్ష్మ బంగారు కణాలుగా మారిపోతుంది. ఈ కణాల పరిమాణం అత్యంత చిన్నదిగా ఉంటుంది. దీంతో అవి గాలిలో తేలుతూ దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నాయి. ఇవి చాలా సూక్ష్మ కణాలు కావడంతో వాటిని సేకరించడం లేదా వాణిజ్యపరంగా వినియోగించడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు భౌగోళిక దక్షిణ ధ్రువానికి సుమారు 1,350 కిలోమీటర్ల దూరంలో, రాస్ ద్వీపంలో ఉన్న ఈ ఎరెబస్ పర్వతం నుంచి బంగారు కణాలు పైకి వస్తున్నట్టు 1991లోనే శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే బంగారం చాలా సూక్ష్మ ధూళి రూపంలో ఉండటం, అంటార్కిటికాలోని తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా దానిని సేకరించడం వీలు కాదు. అంతేకాదు, ఎరెబస్ పర్వతం అంత సూక్ష్మ బంగారు స్ఫటికాలను ఎలా సృష్టించి, విడుదల చేస్తుందో కూడా శాస్త్రవేత్తలకు ఇప్పటికీ తెలియదు.

## ట్రంప్‌కు సుప్రీంలో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)



ట్రంప్ విధించిన ఈ పరిమితులను అమెరికాలోని పలు కిందిస్థాయి కోర్టులు కొట్టేశాయి. ట్రంప్ ఉత్తర్వుల అమలును నిలిపివేశాయి. వీటిని సవాలు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. గత కొన్ని నెలల నుంచి సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. మంగళవారం జరిగిన విచారణలో కింది కోర్టుల తీర్పులతో ఏకీభవించిన సుప్రీంకోర్టు మెజారిటీ ధర్మాసనం.. ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమని తేల్చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని బెంచ్ ట్రంప్ ఉత్తర్వులను కొట్టేసింది.

# పాలమూరు పరువు తీసేలా రేవంత్ వ్యవహారం

(మొదటిపేజీ తరువాయి)



రేవంత్ రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగులను సభలో ప్రదర్శించిన హరీష్ రావు.. సీఎం అనుచిత వ్యాఖ్యల వల్ల ముఖ్యమంత్రి కుర్చీ విలువ కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎలాంటి హామీలు ఇవ్వకపోయినా, ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి పనులు చేసేవారని హరీష్ రావు గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగానికి ఇచ్చిన బోనస్ హామీ అంతా ఒక బోగస్ వ్యవహారంగా మారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మార్కెట్లలో తరుగు పేరుతో నిరుపేద రైతులను దారుణంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చివరకు రైతులకు సకాలంలో యూరియా ఇవ్వడంలో కూడా ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. షాపుల్లో అసలు యూరియా స్టాక్ ఉంచడం లేదు కాబట్టే.. ఆ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి యాప్ లంటూ కొత్త కథలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. ఇదే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై కూడా హరీష్ రావు చమత్కరించారు. జిల్లా మంత్రిగా ఉన్న జూపల్లి అసలు ఏం మాట్లాడుతాడో, ఎందుకు మాట్లాడుతాడో ఆయనకే అర్థం కాదంటూ ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా మంత్రులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని, కాంగ్రెస్ మార్క్ మోసపూరిత పాలనపై రైతాంగం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హరీష్ రావు హెచ్చరించారు. జడ్చర్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్‌లో రైతుల ఆశీర్వాద సభ మీటింగ్ పెట్టిండు. నా దృష్టిలో రైతులను అడుగడుగున వంచించినవ్ కదా.. అది రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అని పెట్టుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని హామీనిచ్చిర్రు.. కానీ ఇచ్చిందెంత రూ.12 వేలు.. అవి కూడా ఒక పంట మొత్తానికే 9వేలు ఎగ్గొట్టిండు. ఒక పంట 3 ఎకరాలే ఇచ్చాడు. ఇంకో పంట 2 ఎకరాల వరకే ఇచ్చాడు.. వాళ్లిచ్చిన ప్రకారం లెక్క తీస్తే ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధుపై రూ.29300 కోట్లు రైతు బంధు పేరిట రైతులకు బాకీ పడిందన్నారు హరీశ్ రావు జడ్చర్ల సభ నుంచి అడుగుతున్నా రేవంత్ రెడ్డి నువ్వు పెట్టుకున్న ఈ రైతు వంచన సభలో రూ.29300 కోట్లు ఎప్పటిలోపు ఇస్తావో తెలంగాణ రైతాంగానికి చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు హరీశ్ రావు. ఈ బాకీ బడ్డ రైతు బంధు డబ్బులు ఎన్ని రోజుల్లోగా తిరిగిస్తావో చెప్పలని తెలంగాణ రైతుల పక్షాన, బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన నేను రేవంత్ రెడ్డిని అడుగుతున్నానన్నారు.

## కాంగ్రెస్ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

లేదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## కార్వాన్‌లో ఎన్నికల అధికారి వాసం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఆవశ్యకతలపై ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ సిఇఒ మాట్లాడుతూ 'సర్' పక్రియ కేవలం ఓటరు జాబితాను పరిశీలించి అర్హులైన ఓటర్లందరికి ఓటుహక్కు కల్పించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం అని అన్నారు. సర్ పక్రియపై ప్రజలు ఆందోళన చేందాల్సిన అవసరం లేదని, ఇది పూర్తి పారదర్శకతతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు సహకరించాలని ఆదేశించారు. పూర్తి చేసిన ఫారాలను తప్పనిసరిగా బిఎల్‌ఒలకు అందజేసిన వారి పేర్లే ఓటర్ జబితాలో చేర్చడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## డెలివరీ బాయ్ చేసిన తప్పుకు మేమెలా బాధ్యులం

### పార్సిల్ వ్యవహారంపై ఇన్‌స్టాలో హీరో అఖిల్ రాజ్ పోస్ట్

**హైదరాబాద్,జూన్ 30 :** డెలివరీ బాయ్‌తో వివాదంపై రాజు వెడ్స్ రాంబాయి సినిమా హీరో అఖిల్ రాజ్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియో విడుదల చేశారు. ఆ వివాదంపై పూర్తి స్థాయిలో వివరణ ఇచ్చారు. 'నిన్న మధ్యాహ్నం నుంచి ఓ వీడియో సర్క్యులేట్ అవుతోంది. కొండాపూర్ జోన్‌లో ఓ డెలివరీ అబ్బాయి మా ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లోని ఫ్లాట్ నంబర్ 201లో ఇవ్వాల్సిన పార్సిల్‌ను మా ఇంటికి తెచ్చి ఇచ్చాడు. మా నాన్న పార్సిల్ తీసుకున్నాడు. మా ఇంట్లో ఎవరో ఆర్డర్ చేశారనుకుని మా అమ్మ దాన్ని ఓపెన్ చేసింది'.. 'ఇంట్లో ఎవరూ ఆర్డర్ చేయలేదని తెలిసి పక్కన పెట్టేసింది. 20 నిమిషాల తర్వాత డెలివరీ బాయ్ వచ్చాడు. ఆ అబ్బాయికి ఇవ్వడానికే ఆ పార్సిల్ పక్కన పెట్టాం. అతడు రాగానే 'బ్రదర్ మీరు అడ్రస్ క్రాస్ చెక్ చేసుకోలేదా?' అని అడిగాను. అతడు తాగేసి ఉన్నాడు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. ఇంతలో మా అమ్మ ఓపెన్ చేసిన పార్సిల్‌ను తీసుకువచ్చింది. 'ఏందే ఫ్రీగా వస్తే తీసుకుంటారా?' అని దారుణమైన మాటలు మాట్లాడాడు. మా అమ్మను అన్నందుకు నాకు కోపం వచ్చింది. ఆ అబ్బాయిని ఏమైనా అంటే నాకేంటి లాభం. నేను కూడా డెలివరీ బాయ్‌గా పని చేశాను'..ఆ అబ్బాయి మాట్లాడిన విధానం తప్పు. ఎదురు ఫ్లాట్‌లో ఉన్న వారు చేసిన పని కారణంగానే ఇదంతా జరిగింది. వాళ్లు మా ఇంటి అడ్రస్ పెడుతున్నారు. గతంలో సిగరెట్లు, ఇతర వస్తువులు మా ఇంటికి వచ్చాయి. సోషల్ మీడియాలో నన్ను ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. మీ ఇంట్లో వాళ్లను నెగెటివ్‌గా మాట్లాడితే మీరేం చేస్తారు. నేను దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. మేము తప్పు చేసి ఉంటే క్షమించండి' అని చెప్పుకొచ్చారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్‌కు కోర్టులో ఊరట

### వివాదాస్పద వ్యాఖ్యల కేసు కొట్టివేత

**హైదరాబాద్, జూన్ 30 :** 2022 నాటి వివాదాస్పద వ్యాఖ్యల కేసులో గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్‌కు భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును హైదరాబాద్ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను నిశితంగా పరిశీలించిన కోర్టు.. రాజాసింగ్‌పై మోపిన ఆరోపణలు ఏవీ సరైనవి కావని నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తుది తీర్పును వెలువరించింది. 2022, ఆగస్టు నెలలో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. మునావర్ షోను నిరసిస్తూ యూట్యూబ్ ద్వారా ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియో దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలోనే రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు అందాయి. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. 022 ఆగస్టు 23వ తేదీన పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే, అరెస్ట్ పక్రియలో పోలీసులు సరైన నిబంధనలు పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించింది. ఆయనను వెంటనే విడుదల చేసింది. రాజాసింగ్ విడుదల తర్వాత నగరంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే కారణంతో, అప్పటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు 2022, ఆగస్టు 25వ తేదీన మంగళ్‌హాట్ పోలీసులు రాజాసింగ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు. దీంతో రాజాసింగ్ 77 రోజుల పాటు జైలులో ఉన్నారు.

## హోంగార్డులను ఇబ్బందులకు గురిచేయవద్దు

### ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్



**హుజూరాబాద్, జూన్ 30 :** రాష్ట్రంలో ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్న హోంగార్డులను అన్యాయంగా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, వారిపై వెంటనే వేసదింపులు ఆపాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ డీజీపీ వెంటనే జోక్యం చేసుకుని హోంగార్డుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 16 వేల మంది, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 1,100 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వల్ప వేతనంతో కుటుంబాలను పోషిస్తున్న హోంగార్డులను వందల కిలోమీటర్ల దూరాలకు బదిలీ చేయడం వల్ల వారు తీవ్ర ఆర్థిక, కుటుంబ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హుజూరాబాద్, వేములవాడ, మంథని, సిరిసిల్ల తదితర ప్రాంతాల మధ్య హోంగార్డులను తరచూ బదిలీ చేయడం వల్ల వారి జీవనం భారంగా మారిందన్నారు. నెలకు సుమారు రూ.30 వేల వేతనం పొందే హోంగార్డులు ప్రతీరోజూ దూరప్రాంతాలకు ప్రయాణించడం సాధ్యంకాదని పేర్కొన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి ఈ బదిలీలను వెంటనే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. గతంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుల నుంచి అక్రమ వసూళ్లు జరిగినట్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొంతమంది హోంగార్డులను ప్రతిపక్ష నాయకులను కలిశారనే పేరుతో బెదిరించడం, వారి వివరాలు సేకరించాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తాయని విమర్శించారు. హోంగార్డులను వీలైనంత వరకు వారి సొంత జిల్లాల్లో లేదా కొత్త జిల్లా పరిధిలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, అన్యాయ బదిలీలను వెంటనే రద్దు చేసి హోంగార్డులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డీజీపీని విజ్ఞప్తి చేశారు.

# ఆలయ భూ కేటాయింపుల్లో పారదర్శకత

**యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి**
**తిరుమల తరహా విధానం అధ్యయనం చేయండి**
**అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం**





**హైదరాబాద్, జూన్ 30 :** స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారు లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశర చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు గడువు విధించారు



## వైభవంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు

**ధర్మపురిలో పుష్కర ఘాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి**

**జగిత్యాల,జూన్ 30 :** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యానించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ధర్మపురిలోని పుష్కర ఘాట్లను మంత్రి అడ్లూరి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గోదావరి పుష్కరాల కోసం ఏడాది ముందుగానే పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి అడ్లూరి చెప్పుకొచ్చారు. ధర్మపురి, కోటిలింగాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.117 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థలు, భక్తుల విశ్రాంతి కేంద్రాల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గత గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయనున్నామని స్పష్టం చేశారు. రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, అత్యవసర వ్యవస్థలను బలోపేతం చేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. పుష్కరాల నిర్వహణలో అనుభవం ఉన్న కన్సల్టెన్సీల సహకారంతో పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక మహోత్సవంగా నిర్వహించడమే తమ లక్ష్యమని వివరించారు. పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

## స్కూలు బస్సుపై కూలిన చెట్టు

**11 ఏళ్ల బాలుడు మృతి.. పలువురికి గాయాలు**

**ముంబై, జూన్ 30 :** ముంబై నగరంలో విషాదం చోటుచేసుకుంది. ఓ పెద్ద చెట్టు స్కూల్ బస్సుపై కూలిపడిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం ఓ స్కూల్ బస్సు చెంబూర్ రోడ్ నంబర్ 11లో వెళుతుండగా పెద్ద చెట్టు కూలి బస్సుపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ఉన్నారు. చెట్టు బస్సుపై పడగానే బస్ కండక్టర్, స్థానికులు వేగంగా స్పందించారు. ధ్వంసం అయిన బస్సు నుంచి పిల్లలను బయటకు తీసుకువచ్చారు. గాయపడ్డ ఐదుగురిని చెన్ ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు, ముంబై బ్రిగేడ్‌కు సమాచారం వెళ్లింది. పోలీసులు, ÷ర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు మొదలెట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ 11 ఏళ్ల విహాన్ శ్రీవాస్తవ్ అనే బాలుడు జెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మిగిలిన ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఘటన గురించి తెలియగానే ముంబై మేయర్ రీతూ తావ్‌డే జెన్ ఆస్పత్రికి వెళ్లారు. బాధితులను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రీతూ తావ్‌డే మాట్లాడుతూ.. 'ఈ సంఘటన ఎంతో బాధాకరం. నేనో తల్లిగా ఇక్కడికి వచ్చాను. పిల్లల తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆ స్కూల్ బస్సులో ప్రమాదం జరిగినపుడు 13 మంది ఉన్నారు. వారిలో 12 మంది క్షేమంగా బయటపడ్డారు. ఓ బాలుడు మృతి చెందాడు' అని తెలిపారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

**హైకోర్టులో విచారణ జులై 6కు వాయిదా**

**హైదరాబాద్,జూన్ 30 :** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్–9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.

## భద్రాద్రి జిల్లాలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

**లారీలో రహస్యంగా తరలిస్తున్న 525 కిలోల గంజాయి స్వాధీనం**



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 30 :** కొత్తగూడెం జిల్లాలో ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులు.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్లుగప్పేందుకు లారీలో ప్రత్యేకంగా ఒక రహస్య భాగాన్ని ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచి తరలిస్తున్నారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు లారీని సోదా చేసి, దాదాపు 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ గంజాయి విలువ మార్కెట్లో సుమారు 2.62 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంయుక్త ఆపరేషన్‌లో పోలీసులు ముగ్గురు నిందితులను ఘటనా స్థలంలోనే అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న లారీతో పాటు, దానికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్న ఒక పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నిందితుల వద్ద ఉన్న 5 మొబైల్ ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.




## బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

**ప్రమాదంతో తల్లి మృతి.. కొడుకు గాయాలు**

**హైదరాబాద్,జూన్ 30 :** నగరంలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. కన్న కొడుకు కళ్ల ముందే తల్లి దుర్మరణం చెందింది. మంగళవారం ఉదయం బహదూర్ పల్లి గ్రామం మెయిన్ రోడ్‌పై మద్యం మత్తు లో బొలెరో డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. బైక్‌పై వెళ్తున్న తల్లీకొడుకును బొలెరో వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి ఉదయ్ లతారెడ్డి(49) అక్కడికక్కడే మృతిచెందగా.. కొడుకు వేదాంత్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వేదాంత్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే లతారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు అయ్యింది.

## కేంద్రమంత్రి బండికి ఊరట

**హుజూరాబాద్ ఉప ఎన్నికల కేసు కొట్టివేత**

**హైదరాబాద్,జూన్ 30 :** హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఊరట లభించింది. ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు ఇస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. అలాగే ఓటర్లకు రూ.5 వేల చొప్పున ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పంచుకుంటున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో హుజూరాబాద్ పోలీసులు బండి సంజయ్‌పై ఐపీసీ సెక్షన్లు 188, 171సీ, 505(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 123(3ఏ) కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

## అసోంలో భారీ ఆపరేషన్

**అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం**

**గౌహతి,జూన్ 30 :** అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.




## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ పేలుడు

- **పేలుడు ధాటికి గోడలు, కిటికీలు ధ్వంసం**
- **పేలుడు మిస్టరీపై పోలీసులు ఆరా**

**హైదరాబాద్,జూన్30 :** హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. రోడ్ నంబర్–4లోని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఈ పేలుడు ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. ఇంట్లోని మూడు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్ పేలలేదని తేలింది. అలాగే అగ్నిప్రమాద ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఘటన సమయంలో కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వీరంతా ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి దేవేందర్ తన భార్య, కుమారుడితో కలిసి గత 24 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నారు. మంగళవారం ఇంట్లోని వంటింట్లో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. పేలుడు ధాటికి ఇల్లు తీవ్రంగా దెబ్బతిన్నది. పేలుడు మిస్టరీగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదం ఆనవాళ్లు కూడా కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నెంబర్–4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ అతని భార్య, కుమారుడితో కలిసి 24ఏళ్లుగా నివాసముంటున్నారు. అతని ఇంట్లోని కిచెన్‌లో ఈ ఘటన జరిగింది. నిపుణుల సాయంతో ఇల్లు ధ్వంసానికి గల కారణాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. సమాచారం అందుకున్న సరూర్ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకొని కారణాలను అన్వేషిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

**బీజేపీ నాయకులకు మంత్రి పొన్నం సవాల్**



**సిద్దిపేట, జూన్ 30 :** వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడే ముందు బీజేపీ నాయకులు ప్రజలకు నిజాలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ చేశారు. కొత్తగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకుడు కేవలం తనను తాను నిరూపించుకోవాలనే ఉద్దేశంతో వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వరంగల్ ఎయిర్‌పోర్టును మంజూరు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇప్పటికే ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఎయిర్‌పోర్టు ప్రక్రియ వేగం పుంజుకుంది. పదేళ్లు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా పట్టణాల అభివృద్ధికి మా ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోంది. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించాం. హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం. స్మార్ట్ సిటీ నిధులపై ఆరోపణలు చేసే బీజేపీ, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి. నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఎందుకు వచ్చిందో కూడా సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్న తీరు ఆశ్చర్యంగా ఉంది. కార్పొరేషన్‌లో మెజారిటీ లేకుండా మేయర్ అవుతామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఎరువుల సరఫరా విషయంలో కూడా బీజేపీ వాస్తవాలను వక్రీకరిస్తోంది. ఎరువులు తయారు చేసి రాష్ట్రాలకు పంపిణీ చేసేది కేంద్ర ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వాటిని అందించే బాధ్యతను నిర్వర్తిస్తోంది. తెలంగాణకు రావాల్సిన నిధులు, ఎరువుల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్లే ప్రతి రూ.10లో తిరిగి కేవలం రూ.3 మాత్రమే వస్తున్నాయి. మిగిలిన నిధుల గురించి కేంద్రం సమాధానం చెప్పాలి. ముఖ్యమంత్రి గారు, మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లినా రాష్ట్రానికి రావాల్సిన నిధులపై స్పందన లేదన్నారు. వరంగల్ అభివృద్ధిపై కేంద్ర మంత్రి బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎవరైనా బహిరంగ చర్చకు రావచ్చు. తెలంగాణకు బీజేపీ చేసిన మేలు ఏమిటో, వరంగల్ అభివృద్ధికి వారు చేసిన కృషి ఏమిటో ప్రజల ముందే చర్చిద్దాం అని మంత్రి అన్నారు.

# సిఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

**సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన**

**హైదరాబాద్, జూన్ 30 :** ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధీ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాద పూర్వకంగా కలిసారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విద్యలో తీసుకువస్తున్న సంస్కరణలను మిట్టల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలను పూర్తి గా ప్రక్షాళన చేస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలను అభివృద్ధి చేస్తున్నాం.. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్ మరియు ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచన చేశారు. హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ , ఎఐకార్యకలాపాలపైన దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేస్తామని సునీల్ మిట్టల్ తెలిపారు. ఎయిర్ టెల్ కు రెండో హెడ్ క్వార్టర్ లా హైదరాబాద్ ను చూస్తున్నామని మిట్టల్ అన్నారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి ముందుకు వస్తామని హామీ ఇచ్చారు. ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఆసక్తి చూపించిన సునీల్ మిట్టల్.



# సిఎంతో హెచ్‌డిఎఫ్‌సి ప్రతినిధుల భేటీ

**సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు ప్రారంభం**

**హైదరాబాద్, జూన్ 30 :** ఎంసీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎంఎల్ ఏ గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఐతా ప్రకాష్ రెడ్డి ,హెచ్ డీఎఫ్ సి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు అంబులెన్స్ ను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వర్చువల్ గా భూపాలపల్లిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మిషన్ ను ప్రారంభించారు. సమావేశం లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలతో లాజిస్టిక్ పార్క్ లు,గోడౌన్ లు,రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వీటి కోసం పెద్దయత్తున రుణాలు మంజూరు చేయాలని, మహిళా సంఘాలు రుణ చెల్లింపులు చాలా బాగున్నాయన్నారు.

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ?



**ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది.**

మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు.

వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి.

ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.




## గ్రీస్‌లోనూ అందుబాటులోకి మన యూపీఐ సేవలు

**న్యూఢిల్లీ, జూన్ 30 :** దేశీయ డిజిటల్ చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన యూపీఐ ఇతర దేశాలకూ విస్తరిస్తోంది. భారత యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సేవలు తాజాగా గ్రీస్‌లోనూ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం గ్రీస్‌లోని ఏథెన్స్‌లో పర్యటిస్తున్న వేళ ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. యూరోబ్యాంక్- ఎన్ఐపీఎల్ భాగస్వామ్యంతో ఈ యూపీఐ సేవలు ప్రారంభించారు. దీని ద్వారా అర్హత కలిగిన వినియోగదారులు తక్కువ ఖర్చుతో వేగంగా, సురక్షితంగా డబ్బు బదిలీ చేసుకోవచ్చని పీయూష్ గోయల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లోని నైస్ నగరంలోనూ, అంతకుముందు పారిస్‌లోని ఈఫిల్ టవర్ వద్ద యూపీఐ సేవలు ప్రారంభించారు. ప్రస్తుతం గ్రీస్‌తో కలిపి సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, మారిషన్, నేపాల్, భూటాన్, ఖతార్, శ్రీలంక, కంబోడియా సహా మొత్తం 10 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భారత పర్యాటకులు విదేశాల్లో సులభంగా డిజిటల్ చెల్లింపులు చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.

## సింధూ జలాల్లో చుక్క నీరు కూడా మోదీ వదలట్లేదు : పాక్

**ఇస్లామాబాద్ :** సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ పక్కనబెట్టడం తో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ ఒప్పందం విషయంలో యుద్ధానికైనా సిద్ధమేనంటూ ఇటీవల కవ్వింపులకు పాల్పడిన దాయాది.. తాజాగా మరోసారి భారత్‌పై ప్రేలాపనలు చేసింది. సింధూ జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ వ్యాఖ్యలు చేశారు. "సింధూ జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోంది. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని మోదీ అడ్డుకుంటున్నారు. మా నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం మాకు దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని మాలిక్ వ్యాఖ్యానించారు. పాక్ మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఈ ఒప్పందం జరిగింది. అయితే, పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్న ట్లు భారత్ స్పష్టం చేసింది.



2028 జూన్ నాటికి సింధు నదీ జలాల ప్రవాహాన్ని పాకిస్థాన్‌కు పూర్తిగా నిలిపివేయవచ్చని భారత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల ఓ కార్యక్రమం లో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే పాక్ మంత్రులు దీనిపై స్పందిస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారు. నీటి సరఫరాను అడ్డుకునే విధంగా భారత్ వేగంగా చర్యలు తీసుకుంటోందని తమకు అనిపిస్తే, సైనిక చర్యలకూ వెనకాడబోమని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు.

## తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

### పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో

**కోల్‌కతా, జూన్ 30 :** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ పక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

### మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ

**న్యూఢిల్లీ, జూన్ 30 :** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.



## వెనెజువెలా భూకంపం..

### 58వేల భవనాలు ధ్వంసం

**వెనెజువెలా :** ఇటీవల సంభవించిన జంట భూకంపాలు వెనెజువెలాకు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఆ దేశంలో 58 వేలకుపైగా భవనాలు ధ్వంసమైనట్లు నాసా అంచనా వేసింది. జూన్ 25న సేకరించిన ఉపగ్రహ డేటా ఆధారంగా ఈ లెక్కలు వెల్లడించింది. క్షేత్రస్థాయిలో విధ్వంస ప్రభావాన్ని అంచనావేసి, సహాయక బృందానికి మార్గనిర్దేశం చేసేందుకు ఈ శాటిలైట్ డేటా ఉపయోగపడుతుందని నాసా పేర్కొంది. అయితే.. 855 భవనాలు దెబ్బతిన్నాయని, వాటిలో 189 పూర్తిగా ధ్వంసమయ్యాయని వెనెజువెలా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ వెల్లడించడం గమనార్హం. ఈ భవన శిథిలాల కింద వేల సంఖ్యలో ప్రజలు చిక్కుకొని ఉంటారనే ఆందోళన నెలకొంది. వారిని బయటకు తీసినా ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. మరోవైపు, గల్లంతైన వారి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. సహాయక చర్యలపై ప్రభుత్వం వైపు నుంచి వస్తోన్న పరిమిత సమాచారం వారిలో అసహనాన్ని నింపుతోంది. ఈ క్రమంలో వాట్సప్ ఒక అత్యవసర నెట్‌వర్క్‌గా మారింది. ఆసుపత్రిలో చేరినవారి వివరాలు, గల్లంతైన వ్యక్తులు, కూలిన భవనాలకు సంబంధించిన వివరాలను షేర్ చేస్తూ వాట్సప్ గ్రూప్‌లను ఒక రిజిస్ట్రీగా మార్చారు. ప్రభుత్వం వైపు నుంచి భారీ సమాచార లోటును ఈ గ్రూప్‌లు భర్తీ చేస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు.

## జెట్ బ్లూ విమానాన్ని ఢీకొన్న డ్రోన్




**వాషింగ్టన్ :** అమెరికాలో ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న జెట్ బ్లూ ఏయిర్‌లైన్స్ విమానాన్ని.. న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఇంటర్నేషనల్ విమానాశ్రయ సమీపంలో డ్రోన్ ఢీకొట్టింది. లాస్ వెగాస్ నుంచి వచ్చిన ఈ విమానం 3 వేల అడుగుల ఎత్తులో ఉండగా.. ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలో 159 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. విమాన కాక్‌పిట్ వెలుపలి భాగాన్ని డ్రోన్ తాకిందని పైలట్ ఏయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు తెలిపాడు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదని, విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని జెట్ బ్లూ ఏయిర్‌లైన్స్ వెల్లడించింది. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు ప్రారంభించింది. విమానాశ్రయ పరిసరాల్లో ప్రతి నెలా దాదాపు 100 డ్రోన్లను గుర్తిస్తున్నామని.. నిషేధిత గగనతలంలో వీటిని ఎగరవేస్తే వారి లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఏఏ హెచ్చరించింది.



## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

### పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్

**న్యూఢిల్లీ,జూన్30 :** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

## ఆశారాంబాపుకు దక్కని ఊరట

### బెయిల్ మంజూరుకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, జూన్ 30 :** 2013లో ఓ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు బాబా ఆశారం బాపునకు సుప్రీంకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించలేదు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. తనపై విధించిన జీవిత ఖైదును సమర్థిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆశారాం బాపు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆశారాం పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకు ఆశారాంకు ఎలాంటి బెయిల్ మంజూరు చేయబోమని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ఆశారాం తరఫు న్యాయవాదులు వైద్య కారణాలను ప్రస్తావిస్తూ బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అయితే ప్రస్తుతం అలాంటి తక్షణ ఉపశమనానికి అవకాశం లేదని ధర్మాసనం తెలిపింది. ప్రాణాలకు ముప్పు కలిగించేంత తీవ్రమైన అత్యవసర పరిస్థితి ఉన్న సందర్భాల్లో మాత్రమే బెయిల్ అంశాన్ని పరిశీలించగలమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే కౌంటర్‌ను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై



తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, 2013లో రాజస్థాన్‌లో ఓ మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో ఆశారాం బాపు దోషిగా తేలారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు జీవిత ఖైదు విధించింది. ప్రస్తుతం ఆశారాం జోధ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఆయన న్యాయపరమైన పోరాటం కొనసాగుతున్నప్పటికీ, తక్షణ ఉపశమనం మాత్రం లభించలేదు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం సమర్పించే అఫిడవిట్, తదుపరి విచారణలో కోర్టు అభిప్రాయం కీలకంగా మారనున్నాయి.



# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

### పాల్గొన్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్

**శేరిలింగంపల్లి, జూన్ 30 (జనంవార్త ) :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మేడ్చల్ జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ (ఓబీసీ)మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ పాల్గొని పార్టీ బలోపేతం,సభ్యత్వ విస్తరణ,ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఓబీసీ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలను పార్టీకి మరింత చేరువ చేసే దిశగా కృషి చేస్తామని తెలిపారు.



### అభివృద్ధి పనులను ప్రారంభించిన

# మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య

**పెద్దపల్లి, జూన్ 30 :** పెద్దపల్లి పట్టణంలోని 12వ వార్డు సాగర్ రోడ్ లో ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు చేతుల మీదుగా యూఐడీఎఫ్ నిధులు (1,55లక్షలు) కోటి 55 లక్షల రూపాయలతో సిసి రోడ్లు,సిసి డ్రైనేజిల నిర్మాణ పనులు చేపట్టుటకు శిలాఫలకం ప్రారంభోత్సవం చేసుకోగా అట్టి పనులను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య స్థానిక వార్డు కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ని వార్డు కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీష్ స్థానిక నాయకులు శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయ రమణారావు సహకారంతో పెద్దపల్లి పట్టణంలోని అన్ని వార్డులో సీసీ రోడ్లు, సిసి డ్రైనేజి,అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణాలను పూర్తి చేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం 12వ వార్డులోని మంచినీటి బావిని,శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ పాగల శ్రీకాంత్, మున్సిపల్ ఏఇ సతీష్,నాయకులు దొడ్డుపల్లి శేఖర్, దేవనంది దేవరాజ్, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, రాగినేడు వైద్య సిబ్బంది డా,, మమత,ఏఎన్ఎం నిర్మల, ఆశ వర్కర్ మమత, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




### కలెక్టరేట్ ఎదుట ధర్నాను

# విజయవంతం చేయండి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు

**వేములవాడ, జూన్ 30 :** వ్యవసాయ రంగంపై ఆధారపడిన కూలీల వేతనాలు పెంచేలా పార్లమెంట్‌లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి, చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. వ్యవసాయ కూలీల హక్కులను కాలరాసే వి బి జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన కొత్త మార్పులను పక్కనపెట్టి, పాత విధానాన్ని యథావిధిగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజాల శ్రీధర్, ఉపాధ్యక్షులు మునిగే మాధురి, కుడుకుల గిరిబాబు, మరియు రైతు సంఘం అధ్యక్షులు రామంచ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం

### హరిదాస్‌నగర్‌కి చెందిన గున్నాల మమత అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



**వేములవాడ, జూన్ 30 :** ఎల్లారెడ్డిపేట హరిదాస్ నగర్ గ్రామానికి చెందిన గున్నాల మమత, భర్త ఆంజనేయులు, వయస్సు 55 సంవత్సరాలు, కులం గౌడ్ అను ఆమె అతని కొడుకు అయిన గున్నాల శ్రీకాంత్ గల్ఫ్ దేశం వెళ్లి అక్కడే ఒక కంపెనీలో పని చేస్తున్నాడు. గున్నాల మమత తన కొడుకు శ్రీకాంత్ కి ఏజెంట్ లైసెన్స్ ఉందని అమాయక ప్రజలకి చెప్పి వారిని గల్ఫ్ పంపించి మంచి కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి వారిని విసిట్ వీసా మీద గల్ఫ్ దేశం పంపించి ఎటువంటి కంపెనీలో ఉద్యోగం చూపించకుండా వారిని మోసం చేసి అధికంగా డబ్బులు తీసుకునేది. ఇట్టి విషయంలో గతంలో కొనరావుపేట పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదయింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండ్ల రాజు, తండ్రి నారాయణ అను అతని కొడుకు అయిన గుండ్ల నవీన్ ని కూడా గల్ఫ్ దేశం పంపిస్తానని అతని వద్దనుండి 1,70,000 రూపాయలు తీసుకొని గుండ్ల నవీన్ ను విజిట్ పిసా మీద దుబాయ్ పంపగా దుబాయిలో ఉన్న గున్నాల శ్రీకాంత్, నవీన్ ను అక్కడ కంపెనీలో కాకుండా మామూలుగా పని చేయించి అటు ఇటు తిప్పినాడు. కంపెనీ వీసా కోసం డబ్బులు తీసుకొని మోసం చేసి విజిట్ మీద పంపినారని డబ్బుల గురించి అడిగితే ఏం చేసుకుంటారో చేసుకో అని బూతులు తిట్టినారనీ గుండ్ల రాజు ఇచ్చిన తీ/శీ తిమ్మాపూర్ ఇచ్చిన దరఖాస్తుపై గున్నాల మమత పై మరియు అతని కొడుకు శ్రీకాంత్ పై ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి నిన్న గున్నాల మమతను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ గున్నాల మమతకు రిమాండ్ విధించారు. గున్నాల మమత కొడుకు శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు..

### సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో

# పోలీసు అధికారులు, సిబ్బందికి ఘన వీడ్కోలు

### సీపీ డాక్టర్ ఎం. రమేష్ చేతుల మీదుగా సత్కారం -- పెన్షన్ పత్రాలు, జ్ఞాపికల అందజేత..



**శేరిలింగంపల్లి, జూన్ 30 :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో మంగళవారం పదవీ విరమణ పొందిన 14 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సుదీర్ఘకాలం ప్రజల భద్రత కోసం సేవలందించిన అధికారులను సత్కరిస్తూ, వారి సేవలను పోలీసు శాఖ ఘనంగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో సీఐ సెల్‌కు చెందిన ఎస్ఐ జాకీర్ హుస్సేన్, సీటీసీ ఎస్ఐ వెంకట్ రెడ్డి, షాబాద్ ఎస్ఐ శంకర్ రెడ్డి, సనత్‌నగర్ ఎస్ఐ నాగరాజులు, పీసీఆర్ ఎస్ఐ షేక్ షబుద్దీన్, రామచంద్రాపురం ఎస్ఐ నారాయణ గౌడ్, షీ టీమ్స్ ఎస్ఐ శ్రీనివాస్, ఆమనగల్ ఎస్ఐ సీతారాం రెడ్డి, ఆమనగల్ ఏఎస్ఐ ఎస్. మురలీధర్, మాదాపూర్ ఏఎస్ఐ మాణిక్ రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ సుబ్బరాయుడు, ఏఆర్ఎస్ఐ మాణిక్ రెడ్డి, పీసీఆర్‌కు చెందిన పీసీ ఎ. లక్ష్మణ్ నాయక్, నార్సింగి పోలీస్ స్టేషన్ హెచ్‌జీ ఎం. నగేష్ సగర్వంగా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం నిజాయితీగా సేవలందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజల భద్రత కోసం కుటుంబానికి దూరంగా ఉంటూ విధులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి అహర్నిశలు సేవలందించిన పోలీసు సిబ్బంది సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పోలీసు కుటుంబ సభ్యులు కూడా ఎంతో సహనంతో, క్రమశిక్షణతో పోలీసు ఉద్యోగులకు అండగా నిలిచారని, వారి త్యాగం కూడా ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అలాగే అవసరమైన సందర్భాల్లో తమ అనుభవాలను పోలీసు శాఖతో పంచుకుని శాఖ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు , పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన సహచరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సిగాచి విషాదానికి ఏడాది

- బాధితులకు న్యాయం ఇంకా అందలేదు!.
- ప్రభుత్వ హామీలు ఏమయ్యాయి?
  - మాద్రి పృథ్వీరాజ్ ప్రశ్న.
- పాశమైలారంలో అమర కార్మికులకు బీఆర్ఎస్ నేతల ఘన నివాళి..




**పటాన్ చెరువు, జూన్ 30 :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం బీపీఎల్ చౌరస్తా వద్ద ఏడాది క్రితం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని అమరుల చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, "సిగాచి పరిశ్రమ ప్రమాదం జరిగి నేటితో ఏడాది పూర్తయినా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదు. పరిహారం, పునరా వాసం, ఉద్యోగ భద్రత



వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బాధిత కుటుంబాలు ఇప్పటికీ న్యాయం కోసం ఎదురుచూస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల జ్ఞాపకార్థం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. బాధితుల కోసం నిర్వహించే కార్యక్రమానికే అనుమతి ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అనుమతి లభించకపోయినా సభాస్థలం సమీపంలోనే అమర కార్మికులకు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించామని తెలిపారు. "బాధిత కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. వారి హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం అండగా నిలుస్తుంది" అని మాద్రి పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు నివాళులర్పిస్తూ, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాల ఏర్పాటు




**పెద్దపల్లి, జూన్ 30 :** రోడ్డు ప్రమాదాల నివారణకు వినూత్న చర్యగా సుల్తానాబాద్ పోలీసులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు, ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో 3డీ యానిమే టెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను ఏర్పాటు చేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు అధికంగా జరిగే నారాయణపూర్ క్రాస్‌రోడ్ మరియు ఎస్ఆర్ఎస్పీ కాలువ సమీపంలోని కాట్న పల్లి ప్రాంతంలో ఈ 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇటువంటి 3డీ యానిమేటెడ్ నమూనాలను పలు దేశా ల్లో కూడా విజయవంతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుం టున్న నేపథ్యంలో, అతివేగంగా లేదా మద్యం మత్తులో వాహనాలు నడిపే వాహనదారులు దూరం నుంచే ఈ 3డీ యానిమేటెడ్ పోలీసు పెట్రోలింగ్ వాహన నమూనాలను గమనించి వాహన వేగాన్ని తగ్గించే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయంలో కూడా ఈ నమూనాలు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లను అమర్చినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

### పేద గర్భిణీలకు విశ్వహిత

# సేవా ట్రస్ట్ ఉచిత ప్రసూతి సేవలు

### పోస్టర్ ఆవిష్కరించిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**పెద్దపల్లి, జూన్ 30:** ఆర్థిక ఇబ్బందులతో నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్న గర్భిణీ స్త్రీల పాలిట విశ్వహిత సేవా ట్రస్ట్ ఆశాదీపంగా మారింది. విశ్వహిందూ పరిషత్ సారథ్యం లో, ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ సహకారంతో పేద గర్భిణీలకు పూర్తిగా ఉచితంగా ప్రసూతి సేవలను అందించేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను మంగళవారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ నేటి కాలంలో ప్రసూతి వైద్యం భారంగా మారుతున్న తరుణంలో, పెద్దపల్లి జిల్లా ప్రజల కోసం ప్రియాంక మెటర్నిటీ క్లినిక్ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. సమాజ హితమే లక్ష్యంగా చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కిరణ్ గౌడ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రసూతి



సేవలను ఆర్థికంగా వెనుకబడిన వారికి పూర్తి ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. కేవలం ప్రసవమే కాకుండా, పుట్టిన శిశువుల ఆరోగ్య పరిరక్షణకు కూడా తాము ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను వినియోగించుకోవాలనుకునే గర్భిణీ స్త్రీలు,వివరాల కోసం 9492202108 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు,ట్రస్ట్ ప్రతినిధులు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



### పదవీ విరమణ పొందిన ఎస్సై

# ఠాకూర్ సహదేవ్ సింగ్‌కి ఘన సన్మానం

- మీ సేవలు పోలీసు శాఖకు చిరస్మరణీయం
- అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్

**పెద్దపల్లి, జూన్ 30 :** ఉద్యోగ విరమణ పొందిన పెద్దపల్లి ట్రాఫిక్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న ఠాకూర్ సహదేవ్ సింగ్ మంగళవారం అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ కమిషనరేట్ కార్యాలయంలో పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో క్రమశిక్షణ,నిజాయితీ, అంకితభావంతో సేవలందించిన ఠాకూర్ సహదేవ్ సింగ్ తమ ఉద్యోగ జీవితానికి వీడ్కోలు పలుకుతున్నారని తెలిపారు. పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం వ్యక్తిగత సుఖాలు, కుటుంబ సమయాన్ని సైతం త్యాగం చేస్తూ నిర్వర్తించే గొప్ప బాధ్యత అని అన్నారు. పగలు,రాత్రి అనే తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం మీరు అందించిన సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మీ అనుభవం,క్రమశిక్షణ, సేవాభావం యువ పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. విధి నిర్వహణలో మీరు సంపాదించిన గౌరవం, ప్రజల విశ్వాసం, మంచి పేరు మీ జీవితంలో అత్యంత విలువైన సంపద అని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభమని పేర్కొన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ,ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ,మీ అనుభవాన్ని సమాజానికి మార్గదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు.



### వేములవాడ ప్రధాన రహదారిపై

# నీటి నిల్వ సమస్యకు పరిష్కారానికి చర్యలు

### మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, జూన్ 30 :** వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీ వ్యవస్థలోకి సాఫీగా వెళ్లేలా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. స్థానిక కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్ లతో కలిసి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్వయంగా పనులను పరిశీలిస్తూ, అధికారులకు అవసరమైన సూచనలు అందించి పనులను దగ్గరుండి చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు డ్రైనేజీ మార్గాలను సరిచేసి, వర్షపు నీరు వేగంగా డ్రైనేజీలోకి వెళ్లేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఏఈ అనన్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనం వార్త



## మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ

- తూర్పు కనుమలలో పులుల సంరక్షణపై చర్చ
- రెండు ఆడపులులలను ఇచ్చేందుకు సిఎం అంగీకారం

**ముంబయి, జూన్ 30 :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఏపీలోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడపులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడపులులను ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.



## రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశం

- జులై 3,4,5 తేదీల్లో ఏలూరు వేదికగా రైతు మహాసభలు
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరం
- నష్టపోతున్న అన్ని పంటల రైతులను ఆదుకోవాలి
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

**ఏలూరు, జూన్ 30 :** రాష్ట్ర రైతుల ఉద్యమాలకు జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు దిశా నిర్దేశం చేయనున్నాయని, ఈ మహాసభ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఏలూరులోని అల్లూరు సత్యనారాయణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 3న మధ్యాహ్నం గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి హలో రైతన్న - చలో ఏలూరు పేరుతో రైతు మహా ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని, 4,5 తేదీల్లో డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే, జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్, రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి బాగాలేదని, ఏ పంటకు కనీస ధర రావడం లేదన్నారు. మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, మామిడికి తగిన ధర రాలేదని, పొగాకు రైతులకు పొగ పెడుతున్నారని విమర్శించారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, రో÷-లడెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వాలు కల్పించాయన్నారు. భారీగా పెంచిన ఆక్వా మేతల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వర్జీనియా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కోకో రైతులకు తగిన ధర రాలేదని, కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలన్నారు.ఆయిల్ పామ్ రైతులను ఆయిల్ రికవరీ శాతం పేరుతో కంపెనీల దోపిడీ ఆపాలన్నారు. అమెరికాతో భారత్ జులై మొదటి వారంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు ప్రకటించారని, ఈ ఒప్పందం వలన మన దేశ వ్యవసారంగం తీవ్రంగా దెబ్బతింటుందని, రైతులు నష్టపోతారని ఆందోళన చేశారు. పాలు,పాల పదార్థాలు ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అవుతాయని, పాడి పరిశ్రమ,పాడి రైతులు దివాళా తీస్తారని చెప్పారు. మొక్కజొన్న,సోయాబీన్,పత్తి ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయితే ఇప్పటికే నష్టపోతున్న ఆయా పంటల రైతులు మరింత నష్టపోతారని అన్నారు. అమెరికాతో స్వేచ్ఛా ఒప్పందాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో స్థితిగతులు చర్చించి భవిష్యత్ రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశర చేయనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆంధప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ రైతు రక్షణ,వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఆంధప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంలో కీలకపాత్ర వహిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతుల రక్షణ కోసం నూతన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఆంధప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం నాయకులు ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, పి.రామకృష్ణ, డి.ఎన్.వి.డి ప్రసాద్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంపై విషం చిమ్మిన చౌహాన్

**ఏపీని పొగుడుతూ.. తెలంగాణపై అక్కసు**


**న్యూఢిల్లీ, జూన్ 30 :** తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపా దడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.



# మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ఆంధ్రప్రదేశ్ టాప్

**రూ.1,495.50 కోట్ల రుణాల పంపిణీ**

**అమరావతి, జూన్ 30 :** డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్ రుణాల అమల్లో 99.7 శాతం లక్ష్యాన్ని సాధించింది. రూ.1,500 కోట్ల రుణ లక్ష్యానికి గాను రూ.1,495.50 కోట్ల రుణాలను మహిళా పారిశ్రామిక వేత్తలకు పంపిణీ చేసింది. 1.50 లక్షల మంది మహిళలకు రుణాల అందించాలని లక్ష్యం పెట్టుకోగా, 1,47,840 మందికి వ్యక్తిగత పారిశ్రామిక రుణాలు అందించింది. ఎపీతో సమానంగా లక్ష్యాలను నిర్దేశించు కుని... టార్గెటులో కేవలం 15, 25 శాతం మాత్రమే బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు చేరుకున్నాయి. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎపి ప్రభుత్వం రుణాలు అందించడంలో అద్భుత పనితీరు కనబరుస్తుండ డంతో 2026-27 ఏడాదికి ఏపీకి 1.67 లక్షల మంది మహిళలకు రూ.1670 కోట్లు రుణాలు అందించాలని టార్గెట్ గా పెట్టుకుంది. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలోనూ దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. మహిళల ఆర్థిక సాధికారతలో ఆంధప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర నివేదికలు చెబుతున్నాయి. 2025-26లో 35,934 మంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించిన రాష్ట్రం. 2025-26 ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 95 శాతం సాధించింది. రుణాల పంపిణీతోపాటు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంలోనూ ముందంజలో ఉంది. వ్యాపార నిర్వహణ, ఫైనాన్షియల్-డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధిపై డ్వాక్రా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించచింది. అలాగే డిజిటల్ మానిటరింగ్, ఎంఐఎస్ వ్యవస్థ, ఫీల్డ్ తనిఖీలతో మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాల మంజూరు చేయించే అంశంపై కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వేగంగా రుణాలు మంజూరు చేసి మహిళలకు తోడ్పాటు అందించాయి బ్యాంకులు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ లక్ష్యాల సాధనలో ఆంధప్రదేశ్ ముందంజలో ఉండగా గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, కుటుంబ ఆదాయాల పెంపులో ఏపీ ఆదర్శంగా నిలిచింది. పేద, వెనుకబడిన వర్గాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో జాతీయ స్థాయిలో ఛాంపియన్ గా నిలిచింది ఆంధ్రప్రదేశ్.



# కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

**అదే వేగంతో ముందున్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు**

**రెండు వాహనాల మధ్య నుజ్జునుజ్జు అయిన కారు**

**చిన్నారి సహా ఇద్దరు మృతి**



**విజయవాడ, జూన్ 30 :** కృష్ణా జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్, ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామ-రూపాలు లేకుండాపోయింది. మృతదేహాలు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆ ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు.

## మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

- ఈయేడు కూడా కేజీకి రూ.4 చెల్లిస్తున్నాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ

**అమరావతి, జూన్ 30 :** మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వారికి అండగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

## ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా

**అమరావతి,జూన్30 :** ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు పూర్తిస్థాయిలో రానందున, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 1న ఫలితాలను విడుదల చేయాల్సి ఉండగా, ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్సీ రివైజ్డ్ ఫలితాలు, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చిన అనంతరం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏడాది మే 12 నుంచి 20 వరకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజా నిర్ణయం ప్రకారం జులై 2 వరకు ఈఏపీసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది.



## ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్


- ఖనిజాలకు విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి
- మినరల్ వెల్త్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై అధ్యయనం
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక తవ్వకాల పర్యవేక్షణ
- గనుల శాఖపై సమీక్ష లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, జూన్ 30 :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు ప్రక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు ప్రక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు. రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయూష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దిగొచ్చిన బంగారం ధర



దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, ఫెడ్ వడ్డీ రేటు అంచనాల వంటి కారణాలు ఈ ధరలపై ప్రభావం చూపిస్తున్నాయి. దీనికితోడు దేశీయంగానూ గిరాకీ నెమ్మదించడంతో ఈ లోహాల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. మంగళవారం ఉదయం హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 1,43,970కు పడిపోయింది. కేజీ వెండి ధర రూ. 2.25లక్షలు పలికింది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు దిగొచ్చాయి. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3973.26 డాలర్లుగా ఉంది. క్రితం రోజు దీని ధర 4,100 డాలర్ల వరకు ఉండగా.. ఒక్క రోజులోనే భారీగా దిగొచ్చింది. ఇక, ఔన్సు వెండి ధర 57.42 డాలర్లకు పడిపోయింది. కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ. 1,40లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ. 2.21లక్షలుగా ట్రేడ్ అవుతున్నాయి. అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో పసిడి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో పాటు ఈ ఏడాది చివరి నాటికి వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని ఫెడ్ సంకేతాలిచ్చింది. ఈ క్రమంలోనే బంగారం, వెండిలో పెట్టుబడులను మదుపర్లు వెనక్కి తీసుకుంటున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే సాధారణంగా పసిడిపై పెట్టుబడులు క్షీణిస్తాయి.






# ఇక నంబర్ కనిపించదు..

## యూజర్ నేమ్ రిజర్వ్ చేసుకోండి: వాట్సప్

వాట్సప్ యూజర్ల కోసం టెక్ సంస్థ మెటా మరో కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. వినియోగదారుల ప్రైవసీని కాపాడేందుకు కొత్తగా యూజర్‌నేమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఫోన్ నంబర్‌ను ఎవరికీ షేర్ చేయకుండానే ప్రత్యామ్నాయమార్గంగా యూజర్‌నేమ్‌తో చాట్ చేసేందుకు వీలుకలగనుంది. ఈ ఏడాది చివర్లో విస్తృతస్థాయిలో ఈ ఫీచర్ అందుబాటులోకి రానుందని మెటా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకొనే ఆప్షన్‌ను ప్రారంభించింది. ఆర్థిక, వ్యక్తిగత అంశాల్లో ఫోన్ నంబర్ అత్యంత కీలకం. దానిని కొత్తవారితో షేర్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు కొంత తటపటాయిస్తుంటాం. ఈ ఇబ్బందిని తొలగించి, యూజర్ ప్రైవసీని కాపాడేందుకు వాట్సప్ ఈ ఫీచర్‌ను తీసుకువచ్చింది. దీంతో నంబర్ షేర్ చేయకుండానే యూజర్‌నేమ్‌తో ఇతరులతో కాంటాక్ట్ అవ్వొచ్చు. ఒక వ్యక్తిని తొలిసారి కాంటాక్ట్ చేయాలంటే యూజర్ నేమ్ తెలిసి ఉండాల్సిందేనని వాట్సప్ వైస్ ప్రెసిడెంట్ (ప్రొడక్ట్) అలిస్ న్యూటన్ వెల్లడించారు. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినా.. ప్రైవసీ కోసం ఇప్పటికే ఉన్న బ్లాక్, సైలెన్సింగ్ అన్‌నోన్ కాలర్స్ వంటి నియంత్రణలు కొనసాగుతాయని చెప్పారు. ఇక రిజర్వ్ చేసుకోవాలనుకున్న యూజర్ నేమ్ మూడు నుంచి 35 అక్షరాల పొడవు ఉండొచ్చు. ఇందులో a-z, 0–9, డాట్, అండర్ స్కోర్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. www, చివర్లో com, .net వంటివి ఉపయోగించకూడదు. అదనంగా 4 అంకెలతో యూజర్ నేమ్ కీ కూడా సెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఎవరైనా మిమ్మల్ని మొదటిసారి కాంటాక్ట్ చేయాలంటే వారికి మీ యూజర్ నేమ్‌తో పాటు ఆ కీ కూడా షేర్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఖాతాలున్న క్రియేటర్లు, వ్యాపార సంస్థలు వంటివి ఇప్పుడున్నవాటికి మ్యాచ్ అయ్యేలా యూజర్ నేమ్ పొందేందుకు సంస్థ వీలు కల్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వినియోగదారులున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్. ఐరోపా, ఆసియా, ఇతర ప్రాంతాల్లో దీని వినియోగం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో కట్టుదిట్ట గోప్యతకు డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే యూజర్ నేమ్ ఫీచర్ గురించి ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సప్ ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అక్కడ యూజర్ నేమ్ సెట్ చేసుకునే ఆప్షన్ ఉందో లేదో చూడొచ్చు. లేకపోతే రాబోయే కొన్ని రోజుల్లో మీకు ఈ అప్‌డేట్ పొందే అవకాశం ఉంటుంది.



# వంద శాతం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లే ఆడారా..?: సునీల్ గావస్కర్

మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి భారత్ లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టడంపై టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ స్పందించాడు. టోర్నీలో వంద శాతం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లను భారత్ ఆడించిందా? అని సందేహం వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియాతో చావో రేవో లాంటి మ్యాచ్‌లో ఓటమిపాలైన భారత్ సెమీస్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. "ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓడిపోవడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. కానీ, అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాను టీమ్‌ఇండియా ఓడించాల్సింది. ఆ మ్యాచ్‌లో మంచి స్థితిలో ఉండి కూడా పేలవమైన ఫీల్డింగ్‌తో ఓటమిపాలయ్యారు. ఆ మ్యాచ్‌తోనే భారత్ దాదాపు టోర్నీ నుంచి నిష్క్రమించింది. చాలామంది క్రికెట్ అభిమానులు అడిగే ప్రశ్న ఏంటంటే.. మనం ఫిట్‌గా ఉన్న ప్లేయర్లను టోర్నీలో ఆడించామా? ఒక ప్లేయర్ పూర్తిగా ఫిట్‌గా లేకపోయినా రాణించగల ప్రతిభావంతులైతే వారిని ఆడించడం అర్థం చేసుకోదగినదే. గాయపడిన ప్లేయర్ స్థానాన్ని భర్తీ చేయడానికి రిజర్వ్‌లో ఉన్నవారు సరిపోరని భావించినప్పుడు కూడా ఇలా చేయొచ్చు. అయితే.. టీమ్‌ఇండియా విషయంలో ఇలా జరిగి ఉంటుందని నేను అనుకోవడం లేదు. కానీ, ప్లేయర్లు వేళ్లకు బ్యాండేజీలు వేసుకుని ఆడితే.. అది చిన్న గాయమైనా వారికి ఏదో గాయం ఉందనే భావన అభిమానుల్లో కలుగుతుంది" అని గావస్కర్ పేర్కొన్నాడు.



# ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు ఖాయం..

## అంబటి రాయుడి

పసికూన ఐర్లాండ్ చేతిలో అత్యంత అవమానకర రీతిలో వైట్‌వాష్‌కు గురైన టీమ్‌ఇండియా.. ఇంగ్లాండ్‌తో వైట్ బాల్ సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ సిరీస్‌లో మూడు వన్డేలు కూడా ఉండటంతో.. ఇప్పుడు అందరి దృష్టి సీనియర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల పైనే ఉంది. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ ఆడాలనే లక్ష్యంతో వీరిద్దరూ ఉన్నారు. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మకు మాజీ ఆటగాడు అంబటి రాయుడి నుంచి మద్దతు లభించింది. ప్రపంచకప్ జట్టులో హిట్‌మ్యాన్‌కు చోటు కల్పించాలని కోరాడు. అందుకోసం రాబోయే మ్యాచ్‌ల్లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేస్తాడని పేర్కొన్నాడు. "రోహిత్ శర్మ అనుభవం అమూల్యమైనది. అతడు జట్టులో ఉండటం చాలా అవసరం. ఎందుకంటే అతడు మైదానంలోనే కాకుండా.. డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా మంచి వాతావరణాన్ని నెలకొల్పే నాయకుడిగా వ్యవహరిస్తాడు. ప్రపంచకప్‌లాంటి మెగాటోర్నీకి వెళ్లే ముందు జట్టులో ఇది ఎంతో కీలకం. జట్టు క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు, ప్రపంచకప్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, టీమ్‌ను సిద్ధం చేయడానికి ఆ అనుభవం ఎంతో ఉపయోగపడుతుంది" "ప్రపంచకప్ ప్రణాళికల్లో అతడు కచ్చితంగా ఉన్నాడని నా నమ్మకం. అందుకే అతడిని జట్టులో కొనసాగిస్తున్నారని భావిస్తున్నాను. పైగా అతడి బ్యాటింగ్ అద్భుతంగా ఉంటుంది. అయితే చాలా ఏళ్లుగా జట్టుకు ఆడుతున్నప్పుడు.. ఒక్కోసారి ఆశించిన స్థాయిలో రాణించకపోవచ్చు. కానీ కీలకమైన ఇంగ్లాండ్‌లాంటి సిరీస్‌లో అతడు కచ్చితంగా అద్భుతంగా ఆడతాడనే నమ్మకముంది" అని రాయుడు మద్దతుగా నిలిచాడు. రోహిత్‌తోపాటు జైస్వాల్ కూడా ప్రపంచకప్ ఆడేందుకు అర్హుడేనని రాయుడు తెలిపాడు.

# ఇంగ్లాండ్‌తో రేపే తొలి టీ20

## వైభవ్ అరంగేట్రంపై ఆసక్తి



ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఓటమి నుంచి ఇంకా తేరుకోని టీమ్‌ఇండియా మరో సిరీస్‌కు సిద్ధమైంది. రేపటి నుంచే ఇంగ్లాండ్, భారత్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ మొదలుకానుంది. పసికూన ఐర్లాండ్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై అప్రతిష్ఠపాలైన భారత జట్టు.. బలమైన ఇంగ్లాండ్‌ను వారి సొంతగడ్డపై ఎలా నిలువరిస్తుందా? అని క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఐర్లాండ్‌పై యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని అంతా భావించినా అది జరగలేదు. వైభవ్‌కు అవకాశం ఇవ్వకుండా విమర్శలపాలైన టీమ్‌ఇండియా మేనేజ్‌మేంట్ ఇంగ్లాండ్‌పై కచ్చితంగా ఈ కుర్రాడిని ఆడించే అవకాశాలున్నాయి. బుధవారం జరిగే తొలి టీ20లోనే వైభవ్ అరంగేట్రం ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఐర్లాండ్‌పై విఫలమైన సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లో ఒకరిని బెంచ్‌కే పరిమితం చేసి అభిషేక్‌తో కలిసి వైభవ్‌ను ఓపెనింగ్‌కు పంపే ఛాన్స్ ఉంది.

ఒకవేళ ఛాన్స్ వస్తే వైభవ్ ఇంగ్లాండ్ బౌలర్లను ఎలా ఎదుర్కొంటాడనేది ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ 2026లో ప్రపంచ స్థాయి బౌలర్ల బౌలింగ్‌ను సైతం ఊచకోత కోసిన ఈ కుర్రాడు పేస్‌కు అనుకూలించే ఇంగ్లాండ్ పిచ్‌లపై ఎలా ఆడతాడో చూడాలి. ముఖ్యంగా జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో వైభవ్ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే వీరిద్దరూ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడారు. వైభవ్ బలహీనతలు ఏంటో ఆర్చర్‌కు తెలిసి ఉండొచ్చు. సూర్యవంశీని ఎలా కట్టడి చేయాలి? అని ఐపీఎల్ సందర్భంగా ఆర్చర్‌కు ప్రశ్న ఎదురవగా.. టోర్నీ ముగిసిన తర్వాత సమాధానం చెబుతానన్నాడు.

### బలంగా ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్

హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్, జోర్డాన్ కాక్స్, జాకబ్ బెతెల్, విల్ జాక్స్, ఫిల్ సాల్ట్, టామ్ బాంటన్ వంటి ఆటగాళ్లతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. వీరిని అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్‌లతో కూడిన పేస్ దళం ఎలా కట్టడి చేస్తుందో చూడాలి. తొలి మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న చెస్టర్-లె-స్ట్రీట్‌లోని రివర్‌సైడ్ గ్రౌండ్ మైదానం బౌలర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ గత ఎనిమిది మ్యాచ్‌ల్లో బౌలర్లదే ఆధిపత్యం. సగటు స్కోరు 138 కాగా.. అత్యధిక స్కోరు 195. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం బుధవారం రాత్రి 10 గంటలకు మొదలుకానుంది.

**ఐదు టీ20ల సిరీస్ కోసం ఇరు జట్ల వివరాలు:**

**భారత్:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, సూర్యాంశ్ షెడ్గే, ప్రసిద్ధ్ కృష్ణ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్.

**ఇంగ్లాండ్:** హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, సోనీ బేకర్, టామ్ బాంటన్, జాకబ్ బెతెల్, జోస్ బట్లర్, జేమ్స్ కోల్స్, జోర్డాన్ కాక్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, విల్ జాక్స్, సాకిబ్ మహమూద్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టంగ్, ల్యూక్ వుడ్.

# ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టు



ఈ ఏడాది ఆసియా గేమ్స్‌కు భారత మహిళల జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కెప్టెన్‌గా వ్యహరించనుండగా.. స్మృతి మంధానను వైస్ కెప్టెన్‌గా నియమించింది. ఇటీవల మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ నుంచి మన జట్టు ఫైనల్‌కు చేరకుండానే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ హర్మన్‌పై మేనేజ్‌మెంట్ నమ్మకం ఉంచి.. ఆసియా క్రీడలకు సారథ్య బాధ్యతలను అప్పగించింది. ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన జట్టులోని మిగతా సభ్యుల్లోనూ పెద్దగా మార్పులు చేయలేదు. వికెట్‌కీపర్ బ్యాటర్ యస్తికా భాటియాను మాత్రమే తప్పించి.. ఆమె స్థానంలో జి. కమిలినిని బీసీసీఐ ఎంపిక చేసింది. ప్రపంచకప్ టోర్నీ సమయంలో గాయపడిన శ్రేయాంక పాటిల్‌కు ఆసియా క్రీడల్లోనూ స్థానం కల్పించారు. అయితే, టోర్నీకి ముందు ఆమె ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుంది. జపాన్ వేదికగా సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి. 2023లో చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో టీమ్‌ఇండియా మహిళల జట్టు స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మన అమ్మాయిలు డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా టోర్నీలో దిగనున్నారు.

**భారత జట్టు ఇదే..** హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా గోష్, జి.కమిలిని, భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ

# వంటమనిషిపై దాడి: ఐపీఎల్ క్రికెటర్‌పై కేసు



భోపాల్: పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్, అతడి తండ్రి విశ్రాంత స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై కేసు నమోదయ్యింది. తనను దూషించడంతోపాటు దాడి చేశారని ఆ ఇంట్లో పనిచేసే వంట మనిషి ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు భోపాల్ పోలీసులు వెల్లడించారు. శశాంక్ ఇంట్లో ఇటీవల తాను వంట మనిషిగా చేరానని విపేంద్ర సింగ్ తోమర్ తెలిపాడు. ఉచిత వసతి, భోజనం, నెలకు రూ.15,000 జీతంతో పాటు, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం పొందడంలో సాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు చెప్పాడు. అయితే.. వంటల్లో నాణ్యత లేదని శశాంక్, అతడి తండ్రి, మరో వ్యక్తి తనను దూషిస్తుండడంతో పని మానేయాలనుకున్నట్లు అతడు పేర్కొన్నాడు. వారు అందుకు అంగీకరించకుండా తనను తీవ్రంగా కొట్టారని.. తన మొబైల్ ఫోన్ సైతం లాక్కున్నారని ఆరోపించాడు. దీంతో ఆ వంట మనిషి పోలీసులను ఆశ్రయించాడు. ఆ వ్యక్తి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.



# రెండో రోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ వంటి ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు దోహా వేదికగా ఇరాన్- అమెరికా మధ్య శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం రాణించాయి. సెన్సెక్స్ 249 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,005.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,728.37) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,037.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 76,329.39 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 249.70 పాయింట్ల నష్టంతో 76,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.50 కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్ లాభపడ్డాయి. ఐటీసీ, హిందూస్థాన్‌లీవర్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 94.66గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.21 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 4,025.73 వద్ద కొనసాగుతోంది.

# ఈ20 ప్రయోగాత్మకమే..

## వచ్చే ఏడాది ఫలితాలు: కేంద్రం

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ఇంకా ప్రయగాత్మక దశలోనే ఉందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. దాని ఫలితాలు వచ్చే ఏడాదికల్లా వెల్లడి అవుతాయని తెలిపింది. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల పనితీరు దెబ్బతింటోందని, మైలేజీ తగ్గుతోందన్న ఆందోళనలు నెలకొన్న వేళ ప్రభుత్వం నుంచి ఈ సమాధానం వెలువడడం గమనార్హం. ఈ20 వల్ల ఇంధన భద్రత, పర్యావరణానికి ప్రయోజనకరం అని కేంద్రం పేర్కొంటోంది. ఈ క్రమంలో ఓ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించింది. తమ వద్ద నుంచి ఇథనాల్ కొనుగోళ్లను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించడాన్ని సవాల్ చేస్తూ..కర్ణాటక హైకోర్టును డిస్టిలరీ కంపెనీలు ఆశ్రయించాయి. దీంతో సరఫరాదారులకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ప్రభుత్వరంగ చమురు కంపెనీ అయిన బీపీసీఎల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి బీపీసీఎల్ తరఫున వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఈ20 పెట్రోల్ ప్రక్రియ ప్రయోగాత్మకంగా జరుగుతోందని, దీని ప్రభావం వచ్చే ఏడాది కనిపిస్తుందని తెలిపారు. అయితే, కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌కు ఎందుకు వెళ్లలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించగా.. అటార్నీ జనరల్ స్పందించారు. 2025 అక్టోబర్‌లోనే సప్లయ్ కాంట్రాక్టులు ఖరారయ్యాయని తెలిపారు. ఇదే తరహా కేసులు పలు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకవేళ డివిజన్ బెంచ్‌కు వెళితే, ఇతర హైకోర్టుల నుంచి ఇదే తరహా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అటార్నీ జనరల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. దీనివల్ల ఈ20 పాలసీకి విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. అక్టోబర్‌లోపు సప్లయ్ కాంట్రాక్టులు రెన్యువల్‌కు వస్తాయని, ఆలోపు దీనిపై నిర్ణయం వెలువడాల్సి ఉన్నందున సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఇథనాల్‌కు డిమాండ్‌ను బట్టి కంపెనీలకు సరఫరా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..




# టాక్సిక్ ఓ అద్భుతమైన అనుభం

## నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు

'కేజీఎఫ్' చిత్రాల విజయాల తర్వాత కథానాయకుడు యశ్ నుంచి రానున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంపై నటి హ్యూమా ఖురేషీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 9 నిమిషాల కట్‌ను వీక్షించిన ఆమె, సినిమా విజువల్ ట్రీట్‌గా ఉండనుందని స్పష్టం చేశారు. ఈ సినిమాలో యశ్‌తో కలిసి పనిచేసిన తర్వాత, నేను ఆయనకు అభిమానిని అయ్యాను. అంతకుముందు ఆయనొక పెద్ద స్టార్, ఆయనకు భారీ ఫాలోయింగ్ ఉంది అని మాత్రమే నేను అనుకునేదాన్ని. కానీ ఆయన పని చేసే విధానాన్ని, పనిపై ఆయనకున్న అంకితభావాన్ని కళ్లారా చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా తర్వాత యశ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటారు. ఇటీవలే ఇందులో చిన్న సన్నివేశం చూశాను. నేను ఇప్పటి వరకూ అలాంటి విజువల్స్ ఏ సినిమాలోనూ చూడలేదు. ఆ సన్నివేశాలు అభిమానులకు కచ్చితంగా నచ్చుతాయని హ్యూమా అన్నారు. ఆగస్టు 26న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో యశ్ రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ముస్తాబైన ఈ సినిమాని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించారు. కియారా, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.



# ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబో..

## సుబ్రమణ్యస్వామిపై నాగవంశీ వ్యాఖ్యలపై దుమారం


యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ప్రకటించిన సరికొత్త మైథలాజికల్ చిత్రం అప్పడే సోషల్ మీడియాలో ఒక పెద్ద వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సుబ్రహ్మణ్య స్వామి నేపథ్యంతో రాబోతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ భారీ అంచనాలను పెంచినప్పటికీ, నిర్మాత సూర్యదేవర నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక క్యాప్షన్ తమిళ నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. మురుగన్‌ను ఉద్దేశించి ఆయన ఉత్తరాదిన జన్మించి, హృదయభూమిలో రూపుదిద్దుకుని, దక్షిణాదిన పూజలందుకుంటున్నాడు అని పోస్ట్ చేయడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. తమిళ సంస్కృతి, ప్రాచీన సంగం సాహిత్యం ప్రకారం మురుగన్‌ను తమిళుల దేవుడు అని పిలుస్తారు కాబట్టి, ఆయనను ఉత్తరాదిన జన్మించాడని అనడంపై తమిళ సినీ ప్రియులు తీవ్రంగా మండిపడుతున్నారు. అంతేకాకుండా, అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తమిళానికి బదులు సంస్కృత శ్లోకాన్ని ఉపయోగించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ఎక్స్ లో ట్రోల్స్ చేస్తున్నారు. అయితే మరోవైపు, పురాణాల ప్రకారం శివపార్వతుల కుమారుడైన కార్తికేయుడు హిమాలయాల్లో జన్మించాడని, దేవుడిని ఒక ప్రాంతానికే పరిమితం చేయలేమని మరికొందరు నెటిజన్లు నాగవంశీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. ఈ సున్నితమైన భక్తిరస సబ్జెక్ట్‌ను సాంస్కృతిక విలువలకు భంగం కలగకుండా ఎంతో జాగ్రత్తగా తెరకెక్కించాలని పలువురు మేకర్స్‌ను కోరుతుండగా, కేవలం ఒక్క పోస్టర్‌ను చూసి సినిమాను జడ్జ్ చేయవద్దని ఎన్టీఆర్ అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్ర వివాదంపై హారిక అండ్ హాసిని క్రియేషన్స్ టీమ్ ఇంకా ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వనప్పటికీ, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న క్రేజ్ మరియు అంచనాలు మాత్రం దేశవ్యాప్తంగా రోజురోజుకూ రెట్టింపవుతున్నాయి.

# అల్లరి నరేశ్.. మళ్లీ కామెడీ ట్రాక్

## కొత్త మూవీ రంభ ఊర్వశి మేనక ఫస్ట్ లుక్ విడుదల

కామెడీ కింగ్ అల్లరి నరేష్ మంగళవారం తన పుట్టినరోజును జరుపుకున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టు కుంటోంది.

ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్ గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూరు-స్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.









# నాగబంధంలో అద్భుతమైన పాత్ర నాది

## నటి నభా నటేశ్ ఆసక్తిక విషయాలు వెల్లడి

నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్‌కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.

# సమంత ప్రెగ్నెంట్ అని తెలిసాక జాగ్రత్త పడ్డాం

## మా ఇంటి బంగారం షూటింగ్‌పై నందినిరెడ్డి వెల్లడి

అగ్ర కథానాయిక సమంత తల్లి కానున్న విషయం తెలిసాక..మా ఇంటి బంగారం' షూట్‌లో ఆమె కోసం చాలా జాగ్రత్తలు తీసుకున్నామని దర్శకురాలు నందినిరెడ్డి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో సమంత ఈ గుడ్‌న్యూస్ తనకు చెప్పారని.. ఎవరికీ చెప్పొద్దన్నారని 9 గంటలకు షూట్ ప్రారంభమవుతుందంటే సమంత కచ్చితంగా ఆ సమయానికి సెట్‌లో ఉంటారు. ఈ చిత్రంలో తస్సాదియా సాంగ్ షూటింగ్ అప్పుడు సమంతకు జ్వరం వచ్చిందని 11.30కు వస్తారని అన్నారు. నాకేమో టెన్షన్.. మొదట ఈ పాట 4 రోజులు చేయాలని అనుకున్నాం. షెడ్యూల్ కారణంగా రెండు రోజులకు కుదించాల్సి వచ్చింది. ఒకవైపు సామ్ హెల్త్ బాలేదు.. ఎలా పూర్తవుతుందా అని టెన్షన్ పడ్డాను. చెప్పినట్లే 11.30కు వచ్చి షూట్ కంప్లీట్ కాగానే వెళ్లిపోయింది. మళ్లీ రెండోరోజు రాగానే జ్వరం తగ్గిందా.. ఎందుకు అలా తరచూ వస్తోంది అని అడిగాను. 'జ్వరం కాదు.. నేను ప్రెగ్నెంట్‌ని. ఈ విషయం ఎవరికీ చెప్పకు' అని సమంత చెప్పింది. నాకు చాలా ఆనందం వేసిందని నందినిరెడ్డి అన్నారు. సమంత నాకు ఆ మాట చెప్పగానే డ్యాన్స్ మాస్టర్ దగ్గరకు వెళ్లి ఆమెకు ఆరోగ్యం బాలేదు. తనతో ఎక్కువ రిహార్సల్స్ చేయించొద్దు అని చెప్పాను. చిన్నచిన్న స్టెప్స్‌తో కంటిన్యూ చేద్దామని చెప్పా. సమంత మార్నింగ్ సిక్‌నెస్‌తోనే ఆ పాట పూర్తి చేసింది. కార్ యాక్సిడెంట్ సీన్, ఛేజింగ్ సన్నివేశం కూడా తర్వాత షూట్ చేసినవే. చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. 3.30 తర్వాత నీడలో షూట్ చేశాం. ఆమె ఎక్కువ ఒత్తిడికి గురికాకుండా చూసుకున్నాం అని నందినిరెడ్డి చెప్పారు. సమంతను బెస్ట్‌గా చూపించాలనే ఏకైక ఉద్దేశంతోనే ఈ చిత్ర బృందమంతా వర్క్ చేసినట్లు తెలిపారు.

# అజయ్ దేవగణ్ చౌహాన్ సినిమా టీజర్ విడుదల

## చిత్రంలో సంభాషణలపై క్షత్రియుల అభ్యంతరం



బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు నీరజ్ యాదవ్ తెరకెక్కిస్తున్న 'చౌహాన్' సినిమా టీజర్ విడుదలైన కొన్ని రోజుల్లోనే తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాపై క్షత్రియ పరిషత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ముఖ్యంగా ఈ చిత్ర టీజర్‌లో అజయ్ దేవ్‌గణ్ పలికిన 'పఠానులకు చెప్పండి, చౌహాన్ వస్తున్నాడు' అనే వివాదాస్పద డైలాగ్ సోషల్ మీడియా వేదికగా పెను దుమారాన్ని రేపుతోంది. కాశ్మీర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పెల్లెట్ గన్‌ల వాడకంపై ఉన్న సంభాషణలు, మతపరమైన అంశాలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని నెటిజన్లతో పాటు నటి స్వరా భాస్కర్ వంటి పలువురు ప్రముఖులు సైతం ఇప్పటికే విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే తాజాగా క్షత్రియ పరిషత్ ఈ చిత్రంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను విడుదల చేయడం సినిమా పరిశ్రమలో మరియు రాజకీయ వర్గాలలో తీవ్ర సంచలనంగా మారింది. రాజ్‌పుత్ చరిత్ర అనేది ఎన్నికల ప్రచారాలకు లేదా బాధ్యతారహితమైన మీడియా సంచలనాలకు వాడుకునే రాజకీయ వస్తువు కాదని వారు స్పష్టం చేశారు. చిత్ర నిర్మాతలు కేవలం వివాదాలు సృష్టించి లాభపడాలనే ఉద్దేశంతోనే ఇలాంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌పుత్ వారసత్వాన్ని వివాదాలకు ఎరగా వేయకూడదని డిమాండ్ చేశారు. అయితే ఈ మొత్తం వివాదంపై మరియు క్షత్రియ పరిషత్ లేఖపై చౌహాన్ చిత్ర యూనిట్ కానీ, హీరో అజయ్ దేవ్‌గణ్ కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com